సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా



ఆకాశం.. అరుదైన దృశ్యం

సూర్యోదయం సందర్భంగా ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. నింగిలో సర్పాకారం కనువిందు చేసింది. బుధవారం తెల్లవారు జామున ఈ అరుదైన ఘట్టాన్ని జిల్లా ప్రజలు ఆసక్తిగా గమనించారు. కొందరు కెమెరాల్లో బంధించారు.

- సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం

గురువారం। 30। జనవరి। 2025

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో పకడ్బందీగా సాగాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. ఫిబ్రవరి 1వ తేదీన పింఛన్ల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, హౌసింగ్ డీఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారం, గృహ నిర్మాణ పనులు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, 1వ తేదీన ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. మడకశిర, పెనుకొండ, అగళి, తనకల్లు, అమరాపురం మండలాల ప్రత్యేక అధికారులు పింఛన్ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే హౌసింగ్ కాలనీల్లో పూర్తయిన ఇళ్లను ఫిబ్రవరి 1వ తేదీనే లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులను అప్లోడ్ చేయాలని, డేటా ఎంట్రీలో తప్పుల్లేకుండా చూసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీపీఓ సమత, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- ఉపాధ్యాయులకు డీఈఓ ఆదేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

ఓడీచెరువు : పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని డీఈఓ కృష్ణప్ప ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతి సిలబస్‌పై ఆరా తీశారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. వారి సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి మార్కులు చాలా కీలకమని, దీన్ని గుర్తించి అందరూ చదవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

కాంట్రాక్టర్లకే ‘భోజనం’

సరుకుల కోత.. నేతల మేత

- కేజీబీవీల్లో విద్యార్థినులకు అరకొర భోజనం
- నిత్యావసరాల సరఫరాలో కాంట్రాక్టర్ చేతివాటం
- కిలో పేరుతో 800 గ్రాముల నూనె సరఫరా
- ఇతర సరుకుల్లోనూ కోత
- జిల్లా వ్యాప్తంగా భారీ దందా

సాక్షి, పుట్టపర్తి

ఆర్థిక స్తోమత లేని కారణంగా నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థినులు చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) స్థాపించింది. వసతి, భోజన సదుపాయం కల్పించి విద్యాబుద్ధులు నేర్పుతోంది. కానీ కాంట్రాక్టర్ల అవతారమెత్తిన కూటమి నేతలు నిరుపేద విద్యార్థుల పొట్టకొడుతున్నారు. కేజీబీవీలకు సరఫరా చేయాల్సిన సరుకుల్లో కోత విధిస్తూ జేబులు నింపుకుంటున్నారు. దీంతో మెనూ అమలుకు అవరోధం ఏర్పడగా... వసతి గృహాల్లోని విద్యార్థినులకు అరకొర భోజనం అందుతోంది. దీంతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.



హిందూపురంలోని కేజీబీవీ



వసతి గృహానికి పంపిన వాడిపోయిన కూరగాయలు

నూనె ప్యాకెట్ తూకం వేస్తున్న సిబ్బంది

బోర్డుకే పరిమితమైన భోజనం మెనూ

అన్నింటిలోనూ కోతే..

కేజీబీవీలకు సరుకులు సరఫరా చేయడంలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన క్రమంలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరులోని పాఠశాలలను ‘సాక్షి’ బృందం విజిట్ చేసింది. అక్కడ ఉన్న సిబ్బంది సరుకులకు సంబంధించి ఎలాంటి లెక్కలు చెప్పలేకపోతున్నారు. కాంట్రాక్టరు పేరు చెప్పాలంటే భయపడుతున్నారు. కూరగాయలు తాజాగా లేవు. కోడిగుడ్లు 50 గ్రాముల కంటే చిన్నవిగా ఉన్నాయి. అరటి పండ్లు తినడానికి పనికి రాకుండా ఉన్నాయి. కేజీ నూనె ఉండాల్సిన ప్యాకెట్ల స్థానంలో 800 గ్రాములున్న ప్యాకెట్లు కనిపించాయి. త్రాసులో నూనె ప్యాకెట్ 800 గ్రాములే చూపించడంతో అక్కడ పని చేసే వారే అవాక్కయ్యారు. జిల్లా వ్యాప్తంగా సరఫరా చేసే కాంట్రాక్టర్ ఒక్కరే కావడంతో అన్ని చోట్ల ఇలాంటి దందా జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

ఎప్పుడు పడితే అప్పుడే సరఫరా..

‘‘సరుకులు ఎవరు సరఫరా చేస్తున్నారో తెలీదు. అనంతపురం నుంచి ఫోన్ చేస్తారు. పాలు ఒకరు పంపిస్తారు. కూరగాయలు ఇంకొకరు తీసుకొస్తారు. నూనె ప్యాకెట్లు మరొకరు ఇస్తారు. విద్యార్థుల సంఖ్యకు, ఇచ్చే సరుకులకు సంబంధం లేకుండా ఉంటోంది. సరకుల్లో చాలా వరకు కోత విధిస్తున్నారు. నెలకు సరిపడా సరుకులకు సంబంధించి.. కొన్ని ముందుగా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. ఏ పూటకు ఆ పూట అందజేస్తుండటంతో వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం’’ అని సిబ్బంది తెలియజేశారు. అంతేకాకుండా వచ్చిన సరుకులు రాసుకోవడం, సర్దిపెట్టడం కూడా సమస్యగా మారిందని వాపోయారు. ఎవరు వస్తారో? ఎప్పుడు వస్తారో? ఇస్తారో? అన్న టెన్షన్ రోజూ పడుతున్నామని చెప్పారు.

బాలయ్య అండతోనే(నా)?

హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న ఓ వ్యక్తి కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో వంట సరుకుల కాంట్రాక్టుకు టెండర్ వేశాడు. అనంతరం నేరుగా వెళ్లి ఎమ్మెల్యే బాలకృష్ణను కలిశాడు. దీంతో ఎమ్మెల్యే బాలకృష్ణ.. జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులకు ఫోన్ చేసి.. టెండరు వేసిన వ్యక్తి తన మనిషని... పోటీ లేకుండా తక్కువ ధరకే టెండర్ దక్కేలా చేయాలని చెప్పినట్లు సమాచారం. దీంతో అధికారులు అతనికే సరుకుల సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టగా... సదరు వ్యక్తి ఇష్టానుసారం వ్యవహరిస్తూ తనదైన శైలిలో సరుకుల్లో కోత విధిస్తూ.. చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలున్నాయి.

చర్యలు తీసుకోవాలి



సరుకులు నాణ్యమైనవి ఉంటేనే విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందుతుంది. ప్రభుత్వం ఇచ్చే సొమ్మును కాజేసే క్రమంలో కాంట్రాక్టర్లు సరుకుల్లో కోత విధిస్తున్నారు. కాసుల కోసం విద్యార్థుల పొట్టగొట్టడం మంచిది కాదు. సరుకుల పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తోన్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

- బాబావలి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు వంట సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కూరగాయల తూకాల్లో మోసం, నూనె ప్యాకెట్ల దందా, కోడిగుడ్లలో చిన్న సైజు.. సమయానికి సరుకులు రాకపోవడం.. ఇలా చాలా సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించాలి, లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గ్రామాలకు వెళ్లండి.. పల్లె నిద్ర చేయండి

- కేసుల్లో దర్యాప్తు వేగవంతం కావాలి
- పోలీసులకు ఎస్పీ రత్న పిలుపు



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల సమస్యలు తెలుసుకునేందుకు పోలీసులు గ్రామాలకు వెళ్లాలని, పల్లె నిద్ర చేయాలని ఎస్పీ రత్న ఆదేశించారు. బుధవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో జూమ్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవారీ నేర సమీక్ష చేశారు. నెలరోజుల్లో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, మర్డర్, చోరీల కేసును, దర్యాప్తు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసు నమోదైన 60 రోజుల్లోపు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో అందిన అర్జీలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రోజూ వాహన తనిఖీలు చేపట్టాలని, సరిహద్దు చెక్ పోస్టులను దాటే ప్రతి వాహనంపై దృష్టి సారించాలన్నారు. ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విజుబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన కల్పించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేయడంతో పాటు పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, సైబర్ సెల్ సీఐ తిమ్మారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అసభ్య ప్రవర్తన

- ఫిజియోథెరపిస్ట్‌పై మహిళ ఫిర్యాదు
- మడకశిర ఏరియా ఆస్పత్రిలో ఘటన

మడకశిర : స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వచ్చిన ఓ మహిళపై ఫిజియోథెరపిస్ట్ అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో బాధితురాలు వైద్యురాలికి ఫిర్యాదు చేయగా, అధికారులు విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే... మూడు రోజుల క్రితం ఓ మహిళ ఏరియా ఆస్పత్రికి వచ్చింది. ఓపీలో ఉన్న డ్యూటీ డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుంది. అనంతరం డాక్టర్ సలహా మేరకు ఫిజియోథెరపీ చేయించుకునేందుకు ఆ విభాగానికి వెళ్లింది. ఫిజియోథెరపీ ప్రారంభించిన కొద్దిసేపటికే సదరు మహిళ గట్టిగా కేకలు వేస్తూ గది నుంచి బయటకు వచ్చింది. అనంతరం ఫిజియోథెరపిస్ట్ తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారని మెడికల్ ఆఫీసర్ శశిరేఖకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె ఉన్నతాధికారులకు విషయం తెలపడంతో ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక పంపాలని డీసీహెచ్‌ఎస్ ఆదేశించారు.



మడకశిర ఏరియా ఆస్పత్రి

మెమో ఇచ్చి వివరణ కోరాం

బాధితురాలు జరిగిన ఘటనను నా దృష్టికి తీసుకువచ్చింది. ఆమె ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నా. వెంటనే ఫిజియోథెపిస్ట్‌కు మెమో జారీ చేశా. వివరణ ఇవ్వాలని ఆదేశించా. అంతేకాకుండా జరిగిన ఘటనను డీసీహెచ్‌ఎస్ దృష్టికి కూడా తీసుకెళ్లా. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం. ఆ తర్వాత చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ శశిరేఖ, మెడికల్ ఆఫీసర్

నాపై కక్షగట్టారు

ఆస్పత్రిలో పనిచేసే కొంతమంది నాపై కక్షగట్టి దుష్ప్రచారం చేస్తున్నారు. నన్ను ఇక్కడి నుంచి పంపించడానికి ప్రయత్నం చేస్తున్నారు. మహిళా రోగి కుడి భుజం ఎక్కువగా నొప్పి వస్తుందంటే ఫిజియోథెరపీ చేయడానికి ప్రయత్నించా. అసభ్యంగా ప్రవర్తించాననడం అబద్ధం.

- నారాయణస్వామి, ఫిజియోథెరపిస్ట్

వస్తారా... వాణి వినిపిస్తారా..?

- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం
- ఎమ్మెల్యేలందరూ వస్తారో..లేదో అన్న సందిగ్ధం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సమస్యలతో ప్రజల సతమతం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరగనుంది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. 2024 జూలై 9న తొలి సమావేశం నిర్వహించారు. అప్పట్లో అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మినారాయణ, బీకే పార్థసారథి సహా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. అయితే, అదే ఏడాది అక్టోబర్ 19న జరిగిన రెండో జెడ్పీ సర్వసభ్య సమావేశానికి కేవలం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు పల్లె సింధుర రెడ్డి, ఎంఎస్ రాజు మాత్రమే హాజరయ్యారు. ఇద్దరు ఎంపీలు, తొమ్మిది మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. మంత్రులు పయ్యావుల కేశవ్, ఎస్.సవితమ్మలు ఇప్పటి వరకు జెడ్పీ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ జెడ్పీ సమావేశాలకు ఒక్కసారి కూడా రాకపోవడం గమనార్హం. ఈ క్రమంలో గురువారం జరగనున్న సర్వసభ్య సమావేశానికైనా ఎమ్మెల్యేలంతా హాజరయ్యేరా అని సర్వత్రా చర్చ నడుస్తోంది.



సమస్యల తాండవం..

జిల్లాలో సమస్యలు విలయతాండవం చేస్తున్నారు. వేసవికి ముందే చాలా ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. విద్యుత్ కోతలు రైతులను కుంగదీస్తున్నాయి. పశువులకు గ్రాసం దొరకడం లేదు. మెరుగైన వైద్యం గగనమవుతోంది. మరోవైపు జిల్లాలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. ఊరూరా బెల్ట్ షాపులు వెలిశాయి. బాల్య వివాహాలు నిత్యకృత్యంగా మారాయి. సామాజిక పింఛన్లలో కోతపై పేదలు అల్లాడిపోతున్నారు. ఇలా సమస్యలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న తరుణంలో జరుగుతున్న జెడ్పీ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కూటమి ప్రజా ప్రతినిధులందరూ హాజరై సమస్యలపై విస్తృతంగా చర్చించి, పరిష్కారం చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

శ్రీసత్యసాయి కలెక్టర్‌కు ఏమైంది?

జిల్లాల పునర్విభజన తరువాత శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బసంత్‌కుమార్ మాత్రమే జెడ్పీ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యే వారు. దీంతో అన్ని శాఖల అధికారులు కూడా సమావేశాలకు వచ్చే వారు. అయితే, బసంత్‌కుమార్ తరువాత వచ్చిన కలెక్టర్లు జెడ్పీ సమావేశాలకు రావడం లేదు. ఈ విషయంపై గత జెడ్పీ సమావేశంలో సభ్యులు నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి కలెక్టర్ సహా అన్ని శాఖల అధికారులు రావాల్సిందేనని, లేకపోతే సమావేశాలను బహిష్కరిస్తామని ప్రకటించారు. అప్పట్లో అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్ కలుగజేసుకొని వచ్చే సమావేశానికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కచ్చితంగా హాజరయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఈ సమావేశానికైనా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ హాజరవుతారో లేదో చూడాలి.

సాయీ.. సర్వమూ నీవేనోయీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

- శ్రవణానందభరితంగా సాగిన సంగీత కచేరీ

ప్రశాంతి నిలయం: సత్యసాయిపై కృతజ్ఞతను చాటుతూ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. పుట్టపర్తిలోని సత్యసాయి ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన పది, పదకొండు తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులు బుధవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సత్యసాయి తన మాతృమూర్తి ఈశ్వరమ్మ కోరిక మేరకు పుట్టపర్తిలో విద్య, వైద్య సంస్థలు నెలకొల్పిన విధానాన్ని పాటల రూపంలో వివరించారు. సాయీ..సర్వమూ నీవేనోయి అంటూ సత్యసాయి సేవలను, ప్రేమ తత్వాన్ని చక్కటి పాటలతో వివరించారు. సత్యసాయి సేవలను నృత్య ప్రదర్శన రూపంలో ప్రదర్శించారు. చిన్నారుల చక్కటి స్వరాలు, నృత్య ప్రదర్శన భక్తులను పరవశింపజేసింది. అనంతరం మంచి మార్కులతో పాటు ప్రవర్తనలో మేటిగా నిలిచిన విద్యార్థులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ఆయన సతీమణి హిమ వాహిణి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

పారిశ్రామికాభివృద్ధితోనే ఆర్థిక ప్రగతి

కలెక్టర్ టీఎస్ చేతన్





పరిశ్రమల స్థాపనపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, సమీక్షలో పాల్గొన్న అధికారులు

ప్రశాంతి నిలయం: పారిశ్రామిక అభివృద్ధితోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని, ఇందు కోసం జిల్లాలో పరిశ్రమల స్థాపనకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా పరిశ్రమల శాఖ పనితీరుపై కలెక్టర్ చేతన్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు చేయూతనివ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ, మహిళ వర్గాలకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించి ఉత్పత్తి, సేవారంగంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో పరిశ్రమల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు, ఆమోదం పొందిన వాటి వివరాలను ఆరా తీశారు. పరిశ్రమల స్థాపన అనుమతులు గడువు వరకు వేచి చూడకుండా సత్వరమే మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే బ్యాంకులకు పంపాలన్నారు. అనంతరం పెట్టుబడి, విద్యుత్, వడ్డీ రాయితీ కోసం అందిన 12 క్లెయిములకు సంబంధించిన రూ. 40 లక్షలను మంజూరు చేశారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు కోరుతూ సింగిల్ డెస్క్ పోర్టల్‌లో అందిన 14 దరఖాస్తులు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, ఐపీఓ సంజీవరాజు, డీపీఓ సమత, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, ఎల్‌డీఎం రమణ కుమార్, నాబార్డ్ ఏజీఎం అనురాధ, డిక్కీ జోనల్ అధ్యక్షుడు కోలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెల్‌నెస్ సెంటర్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండలంలోని కంబాలపల్లి సచివాలయ పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఏఎన్ఎం, ఎంహెచ్‌పీల రిపోర్టులు పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు. వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి కళాధర్, ఐడీ ఎస్పీ సుబ్బారావు, డీపీఎం ఎన్‌హెచ్‌ఓ నాగరాజు, స్థానిక డాక్టర్ భాగ్యలక్ష్మి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

కర్ణాటక పోలీసులకు పట్టుబడిన కదిరి వాసి



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కోలారు : జిల్లాలో బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మాలూరు పీఎస్ ఎస్ఐ గీతమ్మ వెల్లడించారు. మాలూరులోని హోసూరు మార్గంలో ఇందిరానగర క్రాస్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వారిని అడ్డుకుని పరిశీలించారు. ఆ సమయంలో వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాన్ని అపహరించికెళుతున్నట్లుగా తేలింది. దీంతో ఇద్దరినీ అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.7.55 లక్షల విలువైన 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన కోనేటి పాల్‌రాజ్, బెంగళూరులోని హెబ్బగోడికి చెందిన జి.అజయ్ ఉన్నారు.

బెంగళూరులో ప్రమాదం... యువతి మృతి



మౌనిక (ఫైల్)

రొద్దం: బెంగళూరులో చోటు చేసుకున్న ప్రమాదంలో రొద్దం మండలానికి చెందిన ఓ యువతి దుర్మరణం పాలైంది. గ్రామస్తులు తెలిపిన మేరకు... మండలంలోని గౌరాజుపల్లికి చెందిన కురుబ శ్రీనివాసులుకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె మౌనిక(23) బీకామ్ వరకు చదువుకుంది. ఈ నెల 1న బెంగళూరుకు వెళ్లిన ఓ ప్రైవేట్ కంపెనీలో వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతోంది. బుధవారం ఉదయం కంపెనీకి బయలుదేరిన ఆమె.. దేవేగౌడ పెట్రోల్ బంక్ వద్ద బస్సు ఎక్కే సమయంలో అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఉమాదేవి, శ్రీనివాసులు, కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

వేగం... ప్రాణాంతకం

☛ మడకశిర మండలం బుళ్లసముద్రం వద్ద జాతీయ రహదారిపై గత ఏడాది డిసెంబర్ 21న ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే చనిపోగా.. 10 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బెంగళూరులోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. ప్రమాద సమయంలో మినీ వ్యాన్‌లో 14 మంది ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు గుడిబండ, అమరాపురం మండలాలకు చెందినవారు. వీరు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వాహన డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు నిర్ధారించారు.



మడకశిర నియోజకవర్గం బుళ్లసముద్రం వద్ద గత ఏడాది డిసెంబర్ 21న చోటు చేసుకున్న ప్రమాదం (ఫైల్)

- రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రయాణం సురక్షితం
- మితిమీరిన వేగమే ప్రమాదాలకు కారణం
- నెల రోజుల పాటు కొనసాగుతున్న విస్తృత చైతన్య కార్యక్రమాలు

హిందూపురం అర్బన్: వాహనాలు నడిపే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అతి వేగం... విరామం లేని ప్రయాణంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఏటా ప్రమాదాల నివారణపై జిల్లా రవాణా శాఖ విస్తృత చైతన్య కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవాల పేరుతో ఎక్కడికక్కడ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

డ్రైవర్లకు ముఖ్యమైన మార్గదర్శకాలు



- పోలీస్ సిగ్నల్ పాటించాలి
- వాహనాన్ని నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లోనే నిలపాలి.
- రోడ్డు మధ్యలో వాహనాలను ఆపరాదు.
- మద్యం, ఇతర మాదకద్రవాలు వినియోగించి డ్రైవింగ్ చేయరాదు.
- పాదచారులు రోడ్డు దాటుతున్నప్పుడు వాహనాన్ని ఆపాలి.
- బ్లైండ్ కార్నర్స్‌లో ఓవర్‌టేక్ చేయరాదు.
- సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు.
- రాత్రి ప్రయాణంలో డిమ్మర్ ఉపయోగించండి.
- లైసెన్స్, వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట తీసుకెళ్లాలి.
- వాహనం బయటకు తీసే ముందు ఒక్కసారి దాని పరిస్థితిని పరిశీంచాలి.
- వాహనంలో ప్రథమ చికిత్సకు అవసరమైన సామగ్రిని ఉంచాలి.

అతివేగం.. నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం..

కండీషన్ లేని వాహనాలను వినియోగించడం, అతి వేగంగా వాహనాలను నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం తదితర అంశాలతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో దాదాపు 80 శాతానికి పైగా ఘటనలు కేవలం మానవతప్పిదాలతోనే జరిగినట్లుగా నిర్ధారణ కావడం ఆందోళనకరం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,500 కిలోమీటర్ల మేర రాష్ట్ర, జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. ప్రధానంగా 44వ జాతీయ రహదారిపై రోజూ ఎక్కడో ఓ చోట ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు మృత్యువాతపడుతున్నారు. ప్రమాదాల కారణంగా వైకల్యం బారిన పడుతున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది.

నిర్లక్ష్యం వీడాలి



వాహనాలు నడిపే సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే బారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. వాహనాన్ని నడిపే సమయంలో ఫోన్ కాల్ వస్తే దృష్టిని ఏమార్చడం సరికాదు. మద్యం, గుట్కాల మత్తులో వాహనాలు నడపరాదు. దూర ప్రయాణం చేసే సమయంలో మధ్యమధ్యలో డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవాలి. కేవలం ర్యాష్ డ్రైవింగ్ వల్లనే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
– కరుణ సాగర్‌రెడ్డి, జిల్లా రవాణాధికారి, హిందూపురం

గుడ్ సమారిటన్‌కు పారితోషికం



ప్రమాదం జరిగిన తర్వాత చాలా మంది క్షతగాత్రులను కాపాడే ప్రయత్నం పక్కన పెట్టి సెల్‌ఫోన్లలో వీడియోలు తీస్తూ కాలయాపన చేస్తున్నారు. అలాగే కేసుల పేరుతో పోలీసులు ఇబ్బంది పెడుతారని మరికొందరు భయపడుతుంటారు. ఈ విధానాలు మంచివి కావు. భయాలను పక్కన పెట్టి క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లోపు కాపాడే ప్రయత్నం చేయాలి. అలా చేసిన వారిని కేంద్ర ఉపరితల రవాణా శాఖ గుర్తించి రూ. 5 వేల నగదు ప్రోత్సాహకంతో పాటు 'ప్రాణదాత' (గుడ్ సమారిటన్) అని పోలీసు శాఖ నుంచి సర్టిఫికెట్ కూడా ఇస్తుంది. ఉత్తమ ప్రాణదాతలుగా నిలిచిన 10 మందికి జాతీయ స్థాయిలో రూ.లక్ష చొప్పున రివార్డునూ ఇస్తారు. ఏదేమైనా ప్రమాదానికి లోను కాకుండా డ్రైవర్లు సురక్షిత ప్రమాణాలు పాటించాలి.
– డీఎస్ఎం వరప్రసాద్, ఎంవీఐ, కదిరి

వీరజవాన్ల పారితోషికాన్ని పెంచాలి

- ప్రధాని మోదీకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి లేఖ
- కేంద్ర హోంశాఖ నుంచి సానుకూల స్పందన



ఉరవకొండ: దేశ రక్షణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు చెల్లిస్తున్న పారితోషికాన్ని పెంచి వారి కుటుంబాలకు అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విన్నవించారు. ఈ మేరకు కొన్ని రోజుల క్రితం ప్రధాని నరేంద్రమోదీకు ఆయన లేఖ రాయగా.. దీనిపై కేంద్ర హోంశాఖ సానుకూలంగా స్పందించింది. వివరాలను బుధవారం శివరామిరెడ్డి వెల్లడించారు. వీర జవాన్లకు ఇప్పటి వరకూ రూ.25 లక్షలు మాత్రమే ఎక్స్‌గ్రేషియాను కేంద్రం చెల్లిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం ఉండదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దీనికి పరిష్కార దిశగా ప్రధానితో పాటు కేంద్ర హోం, రక్షణ మంత్రిత్వ శాఖ, ఏపీ ముఖ్యమంత్రికి లేఖలు రాశారు. వీర జవాన్ల పారితోషికాన్ని రూ.2 కోట్లకు పెంచి, వారి కుటుంబానికి నివేశన స్థలం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి గ్రూప్–1 లేదా గ్రూప్–2 ఉద్యోగాలు కల్పించాలని, వారి పిల్లలు ఎంత వరకు చదివితే అంత వరకూ ఉచితంగా చదివించాలని లేఖలో కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర హోం, రక్షణ మంత్రిత్వ శాఖ లేఖను.. ఎక్స్–సర్వీస్‌మెన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ఎండార్స్ చేస్తున్నట్లు తెలిపింది. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరజవాన్ల కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరారు.

వాహనం ఢీకొని జింక మృతి

అమడగూరు: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ జింక మృతి చెందింది. అమడగూరు మండలం గుండువారిపల్లి వద్ద బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహ ఉడాయించాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జింక కళేబరానికి పశువైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఖననం ఖననం చేశారు.

డీజిల్ అపహరణ



డీజిల్ చోరీ చేయడంతో నిలిచిపోయిన లారీలు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి శివారున 44వ జాతీయ రహదారి పక్కన ఆపిన రెండు లారీల నుంచి 800 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం వేకువజామున అపహరించారు. దీంతో లారీలు అక్కడే ఆగిపోయాయి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు లోడుతో బయలుదేరిన లారీ డ్రైవర్లు నిద్ర ముంచుకు రావడంతో బాచుపల్లి శివారున రోడ్డు పక్కన పెట్రోల్ బంక్ వద్ద ఆపి నిద్రించారు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి డీజిల్ ట్యాంకులకు ఉన్న మూతలు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి పరిశీలిస్తే ట్యాంకులు ఖాళీగా కనిపించాయి. బాధితుల ఫిర్యాదు మేరకు రెండు లారీల్లో రూ.78 వేలు విలువ చేసే 800 లీటర్ల డీజిల్ అపహరించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చదువులకు పంపిస్తే శవాలుగా మారుస్తారా?

- విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన కళాశాలను సీజ్ చేయాల్సిందే
- మంత్రివర్గం నుంచి నారాయణను తొలగించాల్సిందే
- జిల్లా మంత్రులు నోరు మెదకపోవడం దారుణం
- ఐక్య విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



ధర్నా చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పిల్లలను చదువుకునేందుకు నారాయణ విద్యా సంస్థలకు శవాలుగా మారుస్తున్నారని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగర శివారు సోములదొడ్డి సమీపంలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇటీవల మొదటి సంవత్సరం విద్యార్థి చరణ్ కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోములదొడ్డి అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి నారాయణ కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న, ఏఐఎస్బీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి చనిపోయినా పోలీస్ యంత్రాంగం ఇప్పటిదాకా నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై కేసు నమోదు చేయలేదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్థిక శాఖ మంత్రి, వైద్యశాఖ మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ముగ్గురు ఉన్నా ఈ ఘటనపై నోరు మెదపలేదన్నారు. తమ సహచర మంత్రి నారాయణకు చెందిన కళాశాల కావడంతోనే వారు స్పందించలేదని ధ్వజమెత్తారు. ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ నారాయణ విద్యాసంస్థలు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి ఇప్పటిదాకా ఆ కళాశాలలో ఏం జరిగిందనే అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదని, తక్షణమే ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతి సమయంలో అక్కడున్న రక్తపు మరకలు చెరిపివేసినా పోలీస్ యంత్రాంగం కేసు నమోదు చేయలేదన్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినా గాలికి వదిలేశారన్నారు. తక్షణమే నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని, మంత్రి నారాయణను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ. కోటి పరిహారం అందించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కళాశాలను ముట్టడించేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేష్, ఏఐఎస్బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, వీఎస్ఐవీ కార్యదర్శి వినోద్ కుమార్, జనసేన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సిద్ధు, ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హనుమంతు రాయుడు, సిద్ధు, ఐక్య విద్యార్థి సంఘం నాయకులు అంజి, వంశీ, మంజు, చందు, గిరి, సాయి, రాజేష్, కార్తీక్, నాని, సమీర్, యశ్వంత్ పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



గుజ్జల శంకర్ (ఫైల్)

బత్తలపల్లి: వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం సూర్యచంద్రాపురం గ్రామానికి చెందిన గుజ్జల ఈశ్వరయ్య కుమారుడు జి.శంకర్ (37)కు భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యసనాలకు బానిసైన శంకర్... జులాయిగా తిరుగుతూ అప్పులు చేసి జల్సా చేసేవాడు. ఈ క్రమంలో భార్య కూలి పనులు చేస్తూ వచ్చే అరకొర సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటూ అప్పులు తీరుస్తూ వస్తోంది. చెడు అలవాట్లు మానుకుని బుద్ధిగా కుటుంబం బాగోగులు చూసుకోవాలని పెద్దలు పలుమార్లు హితవు చెప్పినా పెడచెవిని పెడుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే అప్పుల వారి వేధింపులు తాళలేక ధర్మవరంలోని సత్యసాయినగర్‌కు మకాం మార్చాడు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం స్వగ్రామానికి వచ్చిన శంకర్... తన బంధువు గుజ్జల గంగాధర్ ఇంటికి చేరుకుని తనకు నిద్ర వస్తోందంటూ గదిలోకి వెళ్లాడు. మధ్యాహ్నమవుతున్నా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన గంగాధర్ తలుపు తోసి చూశాడు. లోపలి నుంచి గడియ వేసి ఉండడంతో బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించాడు. అప్పటికే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న శంకర్‌ను గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శుభ ముహూర్తాలకు వేళాయె



హిందూపురం అర్బన్: ఎంతో విశిష్టమైన మౌని అమావాస్య రాకతో బుధవారం పుష్య మాసం ముగిసి గురువారం నుంచి సుముహూర్తాల మాఘ మాసం ప్రారంభం కానుంది. పరిణయ ముహూర్తాలను వెంటబెట్టుకొచ్చిన ఈ మాసంలో వందలాది జంటలు ఏకం కానున్నాయి. పెళ్లిళ్లే కాకుండా గృహ ప్రవేశాలు, నామకరణోత్సవాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు... తదితర శుభకార్యాలతో ఇంటింటా భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు మోగనున్నాయి.

పండుగలూ అధికమే..

ఈ నెల 30 నుంచి వచ్చే నెల 28 అమావాస్య వరకు ఉండే మాఘ మాసంలో వచ్చే శుభముహూర్తాలతో పాటూ పండుగలు కూడా అధికంగానే ఉంటాయి. ముఖ్యంగా ఈ మాసంలో మాఘ స్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సూర్యోదయానికి ముందే స్నానమాచరిస్తే విశేష పుణ్యఫలమని అందరూ భావిస్తారు. ఈ మాసంలో జాతర్లు, తిరునాళ్లు సందడి చేయనున్నాయి. మాసం చివరి రోజున వచ్చే మహాశివరాత్రి మాఘమాసానికే ఆధ్యాత్మిక శోభను చేకూరుస్తోంది. ఈ నెల 31న వాసవీ ఆత్మార్పణ దినాన్ని అనంతపురం వేదికగా విశేషంగా జరుగుతుంది. అలాగే వచ్చే నెల 3న వసంత పంచమిని పురస్కరించుకుని అక్షరాభ్యాసాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. 4న ప్రత్యక్ష భగవానుడైన సూర్యదేవర ప్రీతికరమైన రథసప్తమి, బంజారాల ఇష్టదైవమైన సేవాలాల్‌జయంతి, రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతీ, మార్కండేయ జయంతి పర్వదినాలు అందరిలో భక్తిభావాన్ని పెంచనున్నాయి.

మంచి ముహూర్తాలున్నాయి



మానసిక ఆనందాన్ని కలిగించే మాఘ మాసంలో మంచి ముహూర్తాలున్నాయి. ఫిబ్రవరి 2, 7, 8, 12, 15, 16, 19, 23 తేదీలలో అన్ని వర్గాల వారికి లాభించే ముహూర్తాలుండడం విశేషం. అత్యంత పవిత్రమైన ఈ మాసంలో ఎన్నో జాతర్లు, తిరునాళ్లు వరుసగా రానున్నాయి. – సునీల్ శర్మ, వేద పండితుడు, హిందూపురం

మూన్నెళ్లు.. కన్నీళ్లు

- పాలిసేనివారిపల్లిలో తాగునీటికి కటకట
- చెడిపోయిన పంచాయతీ బోరు మోటర్
- పనులు మాని నీళ్ల కోసం వ్యవసాయ బోర్ల వద్దకు
- సమస్య తెలిపినా పట్టించుకోని సర్పంచ్, అధికారులు

ఓడీచెరువు: పాలకుల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం ఆ గ్రామానికి శాపంగా మారింది. తాగునీరు సరఫరా ఆగిపోయి మూడు నెలలు అవుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ప్రజలు పనులు మానుకుని పొలాల బాట పట్టారు. మండల కేంద్రం ఓడీ చెరువుకు పది కిలోమీటర్ల దూరంలో గల వెంకటాపురం పంచాయతీలోని పాలిసేనివారిపల్లిలో దాదాపు 80 కుటుంబాలు నివాసముంటున్నాయి. 200 దాకా జనాభా ఉంది. ఇక్కడ ఎక్కువగా వ్యవసాయం, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామపంచాయతీ వారు వేసిన బోరు ద్వారా ట్యాంకులు నింపి తద్వారా నీరు అందిస్తున్నారు. అయితే బోరు మోటర్ పనిచేయకపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. ఈ రోజు వస్తుంది.. రేపు వస్తుంది అని ఎదురుచూస్తే ఎవ్వరూ పట్టించుకోలేదు. ప్రజలు గ్రామపంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే ఆయన 'చేద్దాంలే' అని చెప్పి పంపారు. గ్రామపంచాయతీ/ సచివాలయ అధికారులకు తెలిపినా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. పంచాయతీ అధికారులు మారిపోయారు తప్ప సమస్యను పట్టించుకునేవారు లేరు. ప్రజలు తాగునీటి/ వాడుక అవసరాల కోసం పొలాల బాట పడుతున్నారు. అయితే వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉన్న సమయంలోనే నీరు పట్టుకోవాలి. తెల్లవారుజామున 4 నుంచి 11 గంటల వరకు ఒక వారం.. ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మరొక వారం విద్యుత్ సరఫరా అవుతుంది. ఆ సమయంలోనే ప్రజలు పనులు మానుకుని బిందెలు చేతపట్టుకుని కిలోమీటరు దూరంలోని పొలం వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. మూడు నెలలు అవుతున్నా తమ గోడు ఎవ్వరికీ పట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం తమ ఇళ్ల చుట్టూ తిరిగి.. గద్దెనెక్కిన తర్వాత గుక్కెడు నీరు ఇవ్వకుండా తమను కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలను బలోపేతం చేస్తాం.. పంచాయతీలకు మహర్దశ తెస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అంటే నిజంగా తమకు మంచి రోజులు వస్తాయనుకున్నామని.. ఇలా గడ్డు పరిస్థితులు వస్తాయని ఊహించలేదని అన్నారు. తమ బాధలను అర్థం చేసుకుని నీటి సరఫరా పునరుద్ధరించాలని.. లేకుంటే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



చేతితో నీటిని తోడుకుంటున్న గ్రామస్తుడు



వ్యవసాయ బోరు బావి వద్ద నీటిని పట్టుకుంటున్న దృశ్యం



బిందెలు మోసుకెళుతున్న పాలిసేనివారిపల్లి గ్రామస్తులు